# సింగిల్ పేజీ కథలు

## అసలు సంగతి

"హలో కృష్ణమూర్తీ! చాలా రోజులకి కనిపించావు. ఏం సంగతులు? ఎలా ఉన్నావు? అవునులే! నీకేం మహారాజువి. సిటీలో పెద్ద పేరున్న నర్సింగ్‌హోమ్ యజమానివి. నీ కళ్లకి మాలాంటి వాళ్లు ఆనుతామా?" అన్నాడు రామారావు కృష్ణమూర్తితో నిష్ఠూరంగా.

"అలా అనకురా! నేనెప్పుడూ నీ స్నేహితుడ్నే! అవును లేరా,చాలా రోజులయింది మనం కలిసి చాలా బిజీ కదా మరి నేను. తప్పు ఒప్పుకుంటాన్నా నులే. పద కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం" అంటూ కారు లాక్ చేసి దగ్గరనున్న ఏ.సి. రెస్టారెంట్‌లోకి దారి తీసాడు కృష్ణమూర్తి.

"సరే! నువ్వు తప్పు ఒప్పుకుంటున్నావు కనుక నీతో కలిసి కాఫీ తాగడానికి వస్తున్నాలే. అయితే బిల్ నువ్వే పే చేయాలి సుమా. ఈ బడిపంతులు జేబులు ఖాళీ" అంటూ అతన్ని అనుసరించాడు రామారావు.

"అలాగే లేరా! ఇంత పెద్దయినా నీవు ఏమాత్రం మారలేదు, నీ మాట తీరు మారలేదు" నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

ఇద్దరూ ఓ మూలకి వెళ్లి కబుర్లలో పడ్డారు. రామారావు వద్దంటున్నా వినకుండా రెండుమూడు రకాల స్వీట్స్, హాట్‌కి, కాఫీకి ఆర్డరిచ్చాడు కృష్ణమూర్తి.

రామారావు, కృష్ణమూర్తి యిద్దరూ చదువుకునే రోజుల నుంచి మంచి స్నేహితులు, క్లాస్‌మేట్స్ కూడా. చదువులో రామారావెప్పుడూ ముందు ఉండేవాడు, కృష్ణమూర్తి మాత్రం చదువులో అంతంత మాత్రమే. రామారావుకి మంచి రాంకు వచ్చినా ఆర్థిక పరిస్థితులు, యింటి బాధ్యతల దృష్ట్యా పై చదువులు చదవలేకపోయాడు. అయితే కృష్ణమూర్తికి మెడిసిన్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ రాకపోయినా, భారీగా డొనేషన్ కట్టి మరీ ప్రయివేట్ మెడికల్ కాలేజీలో చదివి ఎమ్.బి.బి.యస్. పూర్తి చేసాడు. సిటీలోనే ప్రాక్టీస్‌పెట్టాడు. అతని అదృష్టమో, లేక అతని వద్ద అసిస్టెంట్స్‌గా పెట్టుకున్న వాళ్ల నైపుణ్యమో, చాలా అనతి కాలంలోనే బాగా ఆర్జించాడు. తర్వాత పెద్ద నర్సింగ్‌హోమ్ కట్టించాడు. అందులో వైద్యం కోసం పేరుమోసిన డాక్టర్లని కన్సల్‌టెంట్సుగా వచ్చే ఏర్పాటు చేసాడు. ప్రస్తుతం అతని పని మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఉంది.

"ఆ ఇప్పుడు చెప్పు. నీ నర్సింగ్ హోమ్ బాగా నడుస్తోందా?" అడిగాడు రామారావు.

"ప్రస్తుతం బాగా నడుస్తోంది. సిటీలో యింకో బ్రాంచ్ తెరుద్దామనుకుంటున్నాను" అన్నాడు కృష్ణమూర్తి.



"ఏమో, నీదంతా అదృష్టంరా! నువ్వు పట్టిందంతా బంగారమే! పుట్టడమే సిల్వర్ స్పూన్‌తో పుట్టావు మరి. మరి మీ అబ్బాయి, అమ్మాయి ఏం చేస్తున్నారు? మీ వాడిని కూడా నీ డాక్టర్ వృత్తిలోకే లాగదలచుకున్నావా? లేక యింజనీర్‌గా చేద్దామనుకున్నావా? మరి అమ్మాయి ఏం చేస్తోంది. పెళ్లి సంబంధాలేమైనా చూస్తున్నావా?" అన్నాడు రామారావు.

"అన్నీ ముందు నా గురించే అడుగుతున్నావ్. నీ గురించి చెప్పు, నీ పిల్లల గురించి చెప్పు"

"నేను చేసేది బడిపంతులు ఉద్యోగం. అందులో విశేషాలేముంటాయి. అబ్బాయి అంటావా, ఎంసెట్‌లో మంచి రాంక్ తెచ్చుకున్నాడు. బ్యాంక్ లోన్ పెట్టి యింజనీరింగ్‌లో చేర్చాను. మరి అమ్మాయి యింకా యింటర్ చదువుతోంది కదా. పూర్తయితే ఏ విషయం ఆలోచించేది" అన్నాడు రామారావు.

"అయితే విను. మా వాడికి మంచి రాంక్ రాలేదు. అయితే వాడే కదా రేప్పొద్దున్న నర్సింగ్ హోమ్ నడిపేది. మరి వాడిని డాక్టర్ని చేస్తేనే కదా నాకు కలిసొచ్చేది. అందుకే రాంక్ రాకపోయినా, మేనేజిమెంట్ కోటాలో వాడికి ఓ సీటు సంపాదించాను. ప్రస్తుతం సెకండ్ యియర్‌లో ఉన్నాడు. చదువు పూర్తయితే నాకు తోడుగా ఉంటాడు మరి."

"మొత్తానికి మీ వాడికి కూడా మేనేజిమెంట్ కోటాలో మెడిసిన్ సీటు సంపాదించావన్న మాట."

"అవును మరి. నేను కూడా మరి డొనేషన్ కట్టే మెడిసిన్ చేసాను కదా! మాదంతా మేనేజ్‌మెంట్ కోటాయే!" పెద్దగా నవ్వుతూ అన్నాడు, రామారావు అన్న మాటలకి ఫీలవకుండా.

"మరి అమ్మాయి సంగతేంటి? ఆమె ఏమిటి చేస్తున్నది?"

"డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఓ కంప్యూటర్ కోర్సు చేస్తోంది. ప్రస్తుతం ఆమె పెళ్లి ప్రయత్నాలు సాగుతున్నాయి."

"మరి యిందులో మేనేజిమెంట్ కోటా ప్రసక్తి లేదు కదా! మరి అందరికీ మేనేజ్‌మెంట్ కోటాయే నన్నావు?" నవ్వుతూ అన్నాడు రామారావు.

"లేకేం! ఆమె పెళ్లి కూడా మేనేజిమెంట్ కోటాలోనే చేస్తాను. ఆ ప్రయత్నాలే సాగుతున్నాయి" అన్నాడు కృష్ణమూర్తి తాపీగా.

"అదెలా! పెళ్లికి, మేనేజిమెంట్ కోటాకి సంబంధం ఏమిటి?" అర్థం కాక అన్నాడు రామారావు.

"ఎందుకు లేదు? ఆమెను వాళ్ల మేనమామ ఒక్కగానొక్క కొడుక్కి యిచ్చి పెళ్లి చేయాలని అనుకుంటున్నాం. వచ్చే నెలలోనే పెళ్లి. మా అల్లుడు (కాబోయే) కూడా ఎమ్.బి.బి.యస్. ఈమధ్యే పూర్తి చేసాడు. అతను కూడా యీ నర్సింగ్‌హోమ్ కొత్తబ్రాంచిలో నాకు సహాయపడతాడు. మరి ఆమెకి సొంతబావే కాబోయే భర్త అయితే, అది మరి మేనేజిమెంట్ కోటా కాక మరింకేమిటి? కచ్చితంగా మేనేజిమెంట్ కోటాయే" అన్నాడు.

నివ్వెరపోయి వింటున్నాడు రామారావు.

**-డి.వి.శ్రీప్రసాద్ (బరంపురం)**